ప్రయాణం.. ప్రమాదభరితం

- సూచిక బోర్డులు కరువు
- రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయని వైనం
- మృత్యువాత పడుతున్న ప్రయాణికులు


జూలెకల్ సమీపంలో రక్షణ గోడలు, సూచిక బోర్డులు లేని కల్వర్టు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని రోడ్లపై ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. మలుపులు, కల్వర్టుల వద్ద సూచిక బోర్డులు, రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నారు.

తరచూ ప్రమాదాలు..

వడ్డేపల్లి మండల పరిధిలోని అలంపూర్– రాయచూర్ ప్రధాన రహదారిపై నాలుగు చోట్ల డబుల్ రోడ్డులోని వాగులపై నిర్మించిన పురాతన కల్వర్టుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేగాక కోయిల్‌దిన్నె, వడ్డేపల్లి, రామాపురం, జూలెకల్, తిమ్మాజిపల్లి రహదారులపై వాగులపై నిర్మించిన కల్వర్టుల వద్ద రక్షణ గోడలు, సూచిక బోర్డులు నిర్మించలేదు. దీంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. ముఖ్యం మూల మలుపుల వద్ద వాహనాలు ఎదురెదురుగా ఢీకొంటున్నాయని వాపోతున్నారు. ప్రమాదాల్లో కొందరు మృత్యువాత పడుతుండగా మరికొందరు ఆస్పత్రి పాలవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇరుకు కల్వర్టులు..

శాంతినగర్ నుంచి వెంకటాపురం వరకు ఉన్న నాలుగు కల్వర్టుల వద్ద పిచ్చి మొక్కలు పెరిగి కల్వర్టులు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా వడ్డేపల్లి మండల పరిధిలో పురాతన కల్వర్టుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు.

భయాందోళనలో ప్రయాణికులు

మండల పరిధిలోని ఆయా గ్రామాలకు వెళ్లే కల్వర్టుల వద్ద హెచ్చరిక బోర్డులు, రక్షణ గోడలు నిర్మించకపోవడంతో ప్రయాణికులు భయాందోళనల మధ్య ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అంతేగాక కల్వర్టుల వద్ద ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరగడంతో కల్వర్టులు అగుపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. కల్వర్టులు, రోడ్డు మలుపులు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అదే విధంగా కల్వర్టుల వద్ద రక్షణ గోడలు కల్పించాలని కోరుతున్నారు.


వడ్డేపల్లి రహదారిలో ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టు

కల్వర్టులు కనిపించడం లేదు



రాత్రి వేళల్లో ప్రయాణించాలంటేనే భయంగా ఉంది. శాంతినగర్ నుంచి వెంకటాపురం వెళ్లే దారిలో కల్వర్టుల వద్ద పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. కల్వర్టులు పెద్దగా నిర్మించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలి.

– బజారి, యాపదిన్నె, అయిజ

సూచిక బోర్డులు లేవు



రాజోళి రహదారిలో వడ్డేపల్లి సమీపంలోని వాగు, జూలెకల్, తిమ్మాజిపల్లి వాగుల వద్ద నిర్మించిన కల్వర్టుల వద్ద రక్షణ గోడలు, సూచిక బోర్డులు లేక తరచూ ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తిమ్మాజిపల్లి వద్ద వాగుపై రక్షణగోడ లేకపోవడంతో బోర్‌బండి కూలీ మృతి చెందారు.

– రామాంజనేయులు, తిమ్మాజిపల్లి, వడ్డేపల్లి

ప్రతిపాదనలు పంపాం

వడ్డేపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారిలో నూతన కల్వర్టుల నిర్మాణం, పాత కల్వర్టుల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడుతాం. మలుపులు, కల్వర్టుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– రెడ్డప్ప, డీఈ, పంచాయతీరాజ్ శాఖ

క్లుప్తంగా

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

మానవపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును అలంపూర్ జూనియర్ సివిల్ జడ్జి మిథున్‌తేజ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అలంపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గద్వాల శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



అలంపూర్: తుంగభద్ర నది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. కర్నూల్ జిల్లా ఈ–తాండ్రపాడు గ్రామానికి చెందిన తెలుగు అనిల్ అనుమతులు లేకుండా కాశీపురం నుంచి లింగనవాయికి ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున ఇమాంపురం వద్ద పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. అదే విధంగా సింగవరం గ్రామానికి చెందిన వ్యక్తి అలంపూర్– ర్యాలంపాడు బ్రిడ్జి వద్ద ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



అయిజ: పెద్దధన్వాడ గ్రామంలో ఈ నెల 20న నిర్వహించనున్న అంబేడ్కర్, జ్యోతిబా పూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను వివిధ సంఘాల నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విడుదల చేశారు. ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకట్రాములు, ప్రకాష్, పల్లయ్య, మారెప్ప, లోరాజు, మోజేష్, ప్రతాప్, బీసన్న, అనిల్, రాజు, శికామని, రాజు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



శాంతినగర్: పశువులకు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధకశాఖ వైద్యురాలు స్వరూపరాణి రైతులకు సూచించారు. వడ్డేపల్లి మండల పరిధిలోని బుడమర్సు గ్రామంలో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. పశువులు వ్యాధి బారి పడకముందే ముందస్తు టీకాలు వేయించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వరప్రసాద్, లతీఫ్, బుచ్చమ్మ, వెంకటమ్మ, పాలాగు, కృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహస్వామి ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

ప్రతి జీవికి నీరే జీవనాధారం

వనపర్తి రూరల్: ప్రతి జీవికి నీరు జీవనాధారమని, ఆరోగ్యంగా జీవించడానికి అందరూ స్వచ్ఛమైన నీటిని తాగాలని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. శుక్రవారం పెబ్బేరు మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో కమ్యూనిటీ ప్యూరీ వాటర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణంగా నీరు సహజ మినరల్ స్ప్రింగ్స్ నుంచి వస్తుందని, ఈ నీటిలో లవణాలు, ఇతర ఖనిజాలు ఉంటాయన్నారు. ఈ నీటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు అదనంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వనపర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి, కమ్యూనిటీ ప్యూర్ వాటర్ సంస్థ మేనేజర్ రమేష్, సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరావు, మజీద్, సంతోష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసరావు

ఇటిక్యాల: రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాడానికే ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని షాబాద్ గ్రామంలో నిర్వహించిన భూ భారతి సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం జిల్లాలో ఇటిక్యాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి గతంలో ప్రజలు అధికారులను కలవాల్సి వచ్చేదని, ఇప్పుడు అధికారులే గ్రామాల్లోకి వచ్చి నేరుగా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారానికి నెలాఖరులోగా అర్హులైన వారికి ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. రైతులు నిర్దేశిత ప్రొఫార్మా ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సదస్సుల్లో భూ రికార్డుల సవరణ, విస్తీర్ణ మార్పులు, వారసత్వ సమస్య, భూమి స్వభావానికి సంబంధించిన లోపాలు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు, సాదా బైనామాలు, సర్వే నంబర్ గల్లంతు, పట్టాదారు పాస్‌బుక్ జారీ కాకపోవడం వంటి అంశాలు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఉచితమని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వీరభద్రప్ప, నరేష్, డీటీ నందిని, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు


నిరసన చేస్తున్న మహిళా సమాఖ్య నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు

గద్వాల: ప్రపంచ అందాల పోటీలను వ్యతిరేకిస్తున్న మహిళా సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చైతన్య మహిళా సంఘం నాయకురాలు జ్యోతి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కృష్ణవేణి చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అందాల పోటీలకు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం దారుణమన్నారు. అరెస్టు చేసిన మహిళా సంఘం నాయకురాళ్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రేవతి, జయమ్మ, గోపాల్, సుభాన్, నాగన్న, వాల్మీకి, హరిబాబు, మోహన్, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

'సురక్షిత ప్రయాణం చేద్దాం'


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆత్మకూర్: సురక్షిత ప్రయాణం చేయడం ద్వారా ఇంటి క్షేమంగా చేరుకుంటామని, వాహనదారులు, ప్రయాణికులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ నరేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా వాహనదారులు, ప్రయానికులకు రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్, నెంబర్ ప్లేట్లు ఉండాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రోషయ్య, హెచ్‌సీలు బాలీశ్వర్‌రెడ్డి, రవీందర్, సిబ్బంది బాలరాజు, రమేష్, రామకృష్ణ, గుప్త, రాములు ప్రయాణికులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం


పులికల్ కొనుగోలు కేంద్రంలో తడిసిన వరి ధాన్యం రాశులు

అయిజ: అకాల వర్షానికి మండలంలోని పులికల్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిల్వ చేసిన వరి ధాన్యం గురువారం రాత్రి తడిసి ముద్దయ్యింది. కొనుగోలు కేంద్రం వద్ద నీటిమడుగులు ఏర్పడి ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. కష్టపడి పండించిన వడ్లు అమ్ముకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. సంచులు రాలేదని, కాంటా వేసిన ధాన్యం తరలించేందుకు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నష్టపోకుండా చూడాలని మండల రైతులు కోరుతున్నారు.

అండర్-19, 23 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక



గద్వాల: అండర్–19, 23 క్రికెట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్ ఎండీసీఏ, హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహించే టోర్నమెంట్‌కు క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు శరత్‌చంద్ర, శ్రీనివాసులు తెలిపారు. ఈ సెలెక్షన్‌లో మొత్తం 60మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. అండర్–19, 23లో 18మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించడమే టోర్నీ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు చేపట్టిన పనుల్లో భాగంగా వెంకటాపురం 33 కేవీకి ప్రత్యామ్నాయంగా 33 కేవీ శాంతినగర్ ఇంటర్ లింకింగ్ పనులు చేపట్టనున్నట్లు విద్యుత్ ఏడీఈ నీలి గోవిందు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల అయిజ, వడ్డెపల్లి, రాజోళి మండలాల్లోని కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అయిజ మండలంలోని వెంకటాపురం, పర్దిపురం, కిష్టాపురం, కురవపల్లి, యాపదిన్నె, గుడిదొడ్డి, ఉప్పల, ఉప్పల క్యాంపు, వడ్డేపల్లి మండలంలోని తనగల, రాజోళి మండలంలోని పచ్చర్ల, మాందొడ్డి, పెద్ద ధన్వాడ, నరసనూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సార్వత్రిక సమ్మె వాయిదా

గద్వాల: ఈ నెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహించాల్సిన సార్వత్రిక సమ్మెను జూలై 9వ తేదీకి వాయిదా వేసినట్లు కేంద్ర కార్మిక సంఘాలు ప్రకటించినట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, నర్సింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా వాయిదా పడినట్లు పేర్కొన్నారు.

'ఉపాధి' కూలి వెంటనే చెల్లించాలి

అమరచింత: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన కూలీలకు 8 వారాలుగా కూలి డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని ధర్మాపూర్ గ్రామంలో శుక్రవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక పోరాటాల వల్ల వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పనులు జరిగే ప్రదేశంలో తాగునీరు, టెంట్, మెడికల్ కిట్లు ఓఆర్‌ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలని కోరారు.

'జూరాల– పాకాల'ను అడ్డుకుంటాం


మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: జూరాల– పాకాలను ప్రాజెక్ట్‌ను అడ్డుకుంటామని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కృష్ణా బేసిన్ నుంచి గోదావరి బేసిన్‌కు నీళ్లు ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. గోదావరి నది నుంచి ఏటా 1000 టీఎంసీలకు పైగా నీరు సముద్రంలోకి వెళ్లతోందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆర్డీఎస్, నెట్టెంపాడు, గట్టు, భీమా, కలక్వకుర్తి, కోయిల్ సాగర్, పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్ట్‌లు పూర్తి కాకుండానే జూరాల– పాకాలను ఎలా ప్రతిపాదిస్తారని ప్రశ్నించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో దశాబ్దాల కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్‌లను పూర్తిచేయకుండా గోదావరి నది నుంచి కాకుండా 400 కి.మీ. దూరంలో ఉన్న పాకాలకు నీళ్ల తరలిస్తాం అంటే జిల్లా ప్రజలు సహించరని మండిపడ్డారు. ముందుగా ఆర్డీఎస్ చివరి ఆయకట్టు వరకు నీళ్లు పారించాలని, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, గట్టు, పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి నష్టం కలిగినా వారి తరుపున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, లక్ష్మణ్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

బాలికల రక్షణకు కృషి చేయాలి


జాంపల్లిలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న జ్యోత్స్న

ధరూరు: బాలికల రక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ జ్యోత్స్న అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జాంపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో అవగాహన సమావేశం నిర్వహించారు. బేటీ బచావో.. బేటీ పడావో నినాదంతో ముందుకు సాగాలన్నారు. సమాజంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, బాల్య వివాహాలపై అవగాహన ఉండాలన్నారు. ఆపద సమయంలో 1098ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ చిట్టెమ్మ, ఫైనాన్సియల్ లిటరసీ నాగరాజు, ఎద్యుకేటర్ కృష్ణయ్య, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి


గట్టులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


మానవపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మానవపాడు: డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. మండల కేంద్రంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ హేమమానస అన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రన్న, హెలెన్, వర్జిన్, దేవమ్మ, ఆశా కార్యకర్తలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గట్టు: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. డెంగీ వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకటాద్రినాయుడు, ఆంజనేయులు, సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇటిక్యాల: పరిసరాల పరిశుభ్రతతో డెంగీ వంటి వ్యాధులను నివారించవచ్చని మండల వైద్యాధికారి రాధిక అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. ఈడిస్ దోమ పగటి పూట కుట్టడం ద్వారా డెంగీ వ్యాధి సోకుతుందన్నారు. దోమల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాన్నారు. దోమ కాటు వద్దు.. దోమ తెరలు ముద్దు, పరిసరాల శుభ్రత ఆరోగ్యానికి తొలిమెట్టు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అవసరం మేరకు ఎరువులు వాడాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

మానవపాడు: రైతులు రసాయనిక ఎరువులను అవసరం మేరకు వాడాలని, భూసారాన్ని పెంచుకోవాలని పాలెం వ్యవసాయ శాస్త్రవేత్తలు జి.ఈశ్వర్‌రెడ్డి, ఎన్.నళిని సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. రైతులు ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రశీదులు భద్రపరుచుకోవాలన్నారు. రశీదులతో పంట నష్టపోయిన రైతులు పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. పంటమార్పిడి పద్ధతులను అవలింభించాలన్నారు. ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఆయిల్‌పాం సాగు గురించి వివరించారు. ఈ సందర్భంగా రైతులు శాస్త్రవేత్తలను పలు ప్రశ్నలు అడిగారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రదీప్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీధర్, భవాని, ప్రకాశ్, రాజమోహన్, వెంకటేష్, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సురక్షిత ప్రసవాలు


మాట్లాడుతున్న స్వరూపరాణి

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమని వైద్యురాలు స్వరూపరాణి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు నెలనెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

ఆత్మకూర్: సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించిన ఎంవీ రామన్ హైస్కూల్ విద్యార్థులను శుక్రవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి అభినందించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు సంస్కృతి 491, అభిగ్నసత్య 484, శ్రీరాంరెడ్డి 483, రాంచరణ్ 481, హర్షిత్ 480, కార్తీక్‌రెడ్డి 480, నవదీప్ 480, నరేష్ 479, పవన్‌రెడ్డి 477, నవదీప్ 475, ప్రసన్న 475, సందీప్‌రెడ్డి 474 ని సన్మానించారు. భవిష్యత్‌లో కూడా ఇలాగే కష్టపడి చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఆన్సి శ్రీధర్ విద్యార్థులు ఉన్నారు.